AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN

## ఏపీలో డీఎస్సీ నోటిఫికేషన్‌కు కసరత్తు




**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పనుంది. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరోసారి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సిద్ధమవుతోంది. రాష్ట్రంలో ఉన్న టీచర్ కొరతను తగ్గించడమే లక్ష్యంగా ఫిబ్రవరి నెలలోనే సుమారు 2,500 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు డీఎస్సీ నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ ఇప్పటికే అంతర్గతంగా కసరత్తు ప్రారంభించింది. పోస్టుల గుర్తింపు, రిజర్వేషన్ విధానం, పరీక్షా సరళి వంటి అంశాలపై అధికారులు చర్చలు జరుపుతున్నారు.


## అమెరికా సైన్యం అదుపులో వెనెజువెలా అధ్యక్షుడు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోతో పాటు ఆయన భార్యను అమెరికా సైన్యం తమ అదుపులోకి తీసుకుందని ప్రకటించారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌లో విషయం వెల్లడించారు. ఇంటర్నేషనల్ డ్రగ్స్ కేంద్రంగా వెనిజులా మారిందంటూ వ్యాఖ్యానించారు. కాగా.. వెనిజులా దేశంలో శనివారం తెల్లవారుజామున భారీ పేలుళ్లు చోటు చేసుకున్నాయి. వీటి అమెరికానే చేపట్టిందని ట్రాంప్ వ్యాఖ్యలతో అర్థమవుతోంది.

3-1-2026 (Saturday) MAIN EDITION

## రాష్ట్రవ్యాప్తంగా 'ఐ కేర్ క్లినిక్స్'



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రజలకు కంటి వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'ఐ కేర్ క్లినిక్స్' ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి రాజనర్సింహ శాసనమండలిలో ప్రకటించారు. ఈ క్లినిక్‌ల నిర్వహణలో సరోజినీ దేవి కంటి ఆసుపత్రి 'హబ్'గా వ్యవహరిస్తుందన్నారు. రెండేళ్లలో 6,12,973 మందికి శుక్లాల ఆపరేషన్లు చేయించామని అని వివరించారు.

## ఆటో డ్రైవర్ల అరెస్టు సరికాదు



**అక్షరటుడే, హైదరాబాద్:** హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని ఆరోపించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఇది పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. మరో మూడేళ్లు ప్రతి ఏప్రిల్‌లో విడతల వారీగా అర్హులకు ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. కానీ గత ప్రభుత్వం పింక్ కలర్ షర్ట్ ఉంటేనే ఇళ్లు ఇచ్చిందన్నారు.



## మహారాష్ట్రలో ఎన్డీఏ జోరు

**అక్షరటుడే, ముంబై:** మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 15న జరగనున్నాయి. అధికార ఎన్డీఏ (మహాయుతి) కూటమి ఇప్పటికే 68 సీట్లను కైవసం చేసుకుంది. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. దీంతో ఏకగ్రీవం అయిన అభ్యర్థుల లెక్క తేలింది. రాష్ట్రవ్యాప్తంగా అధికార కూటమికి చెందిన 68 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీలో నుంచి వైదొలగడంతో ఎన్డీఏ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు.

## బళ్లారి కాల్పుల ఘటన.. ఎస్పీ సస్పెన్షన్

**అక్షరటుడే, కర్ణాటక:** కర్ణాటకలోని బళ్లారిలో బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి వర్గాల మధ్య వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాల్పులు చోటు చేసుకోగా.. ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ తాజాగా ఎస్పీ పవన్ నిజ్జూర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. కాగా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. శుక్రవారమే అధికారులు సస్పెండ్ చేయడం గమనార్హం.

**మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 14 మంది నక్సల్స్ హతం అయ్యారు. ఇందులో కొంటా ఏరియా కమిటీ సభ్యులందరూ చనిపోవడం గమనార్హం. ఆపరేషన్ కగార్, కీలక నేతల మృతి, లొంగుబాట్లతో బలహీనం అవుతున్న పార్టీకి తాజా ఎన్‌కౌంటర్ మరింత నష్టం చేకూర్చింది. మావోయిస్టు పార్టీలో కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్ బర్సా దేవా తెలంగాణ పోలీసులు ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. వరుస ఘటనలతో మావోయిస్ట్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# మావోలకు షాక్

- ఛత్తీస్‌గఢ్‌లో రెండు ఎన్‌కౌంటర్లు
- 14 మంది నక్సల్స్ మృతి
- కొంటా ఏరియా కమిటీ పూర్తిగా హతం
- భారీగా ఆయుధాలు స్వాధీనం

సుక్మా జిల్లాలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలోడి, పోటక్‌పల్లి ప్రాంతాల నుంచి సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) శుక్రవారం సాయంత్రం ఈ ఆపరేషన్‌ను ప్రారంభించింది. సుక్మాలోని కిష్టారం ప్రాంతంలోని పమ్లూర్ గ్రామం సమీపంలో శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరణించిన వారిలో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్డు కూడా ఉన్నాడు. ఎన్‌కౌంటర్‌లో కొంటా ఏరియా కమిటీ పూర్తిగా హతమైంది. అలాగే గతంలో కొంటా ఏఎస్పీ ఆకాశ్‌రావును హత్య చేసిన మావోయిస్టులు సైతం హతం అయినట్లు సమాచారం.

### పక్కా సమాచారం మేరకు..

దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేపట్టారు. శనివారం ఉదయం సుమారు 5.30 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఘటనా స్థలం నుంచి 12 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే మూడు ఏకే47, ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్స్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

### బీజాపూర్‌లో..

బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్ట్‌లు చనిపోయారు. శనివారం తెల్లవారుజామున కాల్పులు చోటు చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు చనిపోయారని పోలీసులు చెప్పారు. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ 10 నుంచి 15 మంది మావోయిస్టులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పలువురు గాయపడ్డట్లు పేర్కొన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

### బలగాల విజయం

దేశంలో 2026 మార్చి 31 వరకు మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆపరేషన్ కగార్ చేపట్టింది. వేల సంఖ్యలో బలగాలు అడవులను నిత్యం జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టుల ఏరివేతలో బలగాలు భారీ విజయం సాధిస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లలో చనిపోయారు. పార్టీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతితో ఉద్యమం బలహీనంగా అయింది. మరోవైపు ఇటీవల పొలిట్ బ్యూరో సభ్యుడు, కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌తో మావోలు చాలా మంది ఉద్యమ బాట వీడటానికి సిద్ధం అయ్యారు. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండడంతో ఆయుధాలు వీడి లొంగిపోతున్నారు.

## కొండగట్టు అంజన్న సేవలో పవన్ కల్యాణ్



**అక్షరటుడే, జగిత్యాల:** ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శనివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కల్యాణ్ ఏపీ నుంచి కొండగట్టు చేరుకున్నారు. ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. పోలీసుల నుంచి పవన్ గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ పూజారులు, అధికారులు స్వాగతం పలికారు. పవన్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీటీడీ నిధులు రూ.35.19 కోట్లతో కొండగట్టులో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ మండపంలో ఒకేసారి రెండు వేల మంది దీక్ష విరమించేలా ఏర్పాట్లు చేయనున్నారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

## అసెంబ్లీని గాంధీభవన్‌లా నడిపిస్తున్నారు: గంగుల



**అక్షరటుడే, హైదరాబాద్:** అసెంబ్లీని గాంధీ భవన్‌లా నడిపిస్తున్నారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. ఆయన తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదన్నారు. ఉద్యమ సమయంలో సైతం సభ్యులకు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చారన్నారు. కానీ శుక్రవారం స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని, తమ గొంతు నొక్కలేదన్నారు. స్పీకర్ పక్షపాత వైఖరితో ఉండొద్దన్నారు. ఆయన వ్యవహార శైలి మార్చుకోవాలని కోరారు. సభలో ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో తమకు అదే హక్కు ఉంటుందని గంగుల అన్నారు.




## వెకేషన్‌లో కేతిక శర్మ..

**అందాల ముద్దుగుమ్మ కేతిక శర్మ సినిమాల కన్నా బ్యూటీతోనే కట్టిపడేస్తుంటుంది. తాజాగా వెకేషన్‌కు వెళ్లిన ఈ అమ్మడు బోటింగ్‌లో దిగిన కొన్ని ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది. ప్రస్తుతం ఇవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. షిప్ డెక్‌పై స్టైలిష్ లుక్స్‌లో కనిపించిన కేతిక అందాలకు అభిమానులు ఫిదా అవుతున్నారు. "చాలా రోజుల తర్వాత కేతిక నుంచి అదిరిపోయే గ్లామర్ ట్రీట్" అంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా.. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ డబ్స్‌మాష్ వీడియోలతో మంచి పాపులారిటీ సంపాదించిన ఆమె, అదే క్రేజ్‌తో దర్శకుల దృష్టిని ఆకర్షించి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే.**


—అక్షరటుడే, సినిమా డెస్క్

## బంగ్లా బౌలర్ ముస్తాఫిజుర్‌కు బీసీసీఐ షాక్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్ బౌలర్ ముస్తాఫిజుర్‌కు బీసీసీఐ షాక్ ఇచ్చింది. ఐపీఎల్ నుంచి అతడిని తొలగించింది. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ 2026 స్క్వాడ్ నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించమని బీసీసీఐ శనివారం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టును కోరింది. బోర్డు కార్యదర్శి దేవాజిత్ సైకియా మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో పలువురు హిందువులు హత్యకు గురైన సంఘటనలు వెలుగులోకి రావడం, ఇటీవలి పరిణామాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## ట్రంప్ తీరుపై ఐరాసను ఆశ్రయించిన ఇరాన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్‌లో సుప్రీం నేత ఖమేనీకి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణంపై ప్రజలు నిరసన తెలిపారు. ఇరాన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. ఆర్థిక సంక్షోభం, కరెన్సీ రియాద్ విలువ పడిపోవడంతో ఆందోళనలు మొదలయ్యాయి. అయితే నిరసనకారులను ప్రభుత్వం అణిచివేస్తోంది. ఇరాన్‌లో ఆందోళనలపై శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. నిరసనకారులపై కాల్పులు జరపవద్దని, వారిని రక్షించడానికి అమెరికా సిద్ధం గా ఉందని ప్రకటించారు. దీనిపై ఇరాన్ ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా చర్యలను ఖండించింది. అగ్రరాజ్యం దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించిం ది. తాజాగా ట్రంప్ తీరుపై అంతర్జాతీయ ఖండన కోరుతూ ఐరాసను ఇరాన్ ఆశ్రయించింది.

## వేగంగా పైప్‌లైన్ మరమ్మతులు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ పథకంలో పైప్‌లైన్ శుక్రవారం మధ్యాహ్నం లీకైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు మరమ్మతు పనులను వేగంగా చేపడుతున్నారు. కరీంనగర్ జిల్లా బొమ్మకల్ పంపింగ్ స్టేషన్ సమీపంలోని శ్రీనివాస్ నగర్ బ్రిడ్జి వద్ద 3000 మీమీ డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్ లీకేజీ అయింది. దీంతో హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగింది. శనివారం ఉదయం ఆరు గంటల వరకు మరమ్మతులు పూర్తి చేస్తామని అధికారులు మొదట తెలిపారు. అయితే ఇంకా పనులు కొనసాగుతున్నాయి. మరమ్మతులపై ఎండీ అశోక్ రెడ్డి జలమండలి ఈడీతో కలిసి అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. నేడు రాత్రి 12 గంటల వరకు పనులు పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

## అమ్మకాల్లో 'మారుతి' నంబర్ వన్

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** దేశీయ కార్ల మార్కెట్‌లో మారుతి సుజుకీ దూసుకుపోతోంది. గతేడాది అత్యధికంగా అమ్ముడైన మోడల్‌గా మారుతి డిజైర్ నిలిచింది. గతనెలలో మాత్రం అత్యధికంగా అమ్ముడైన మోడల్ స్థానాన్ని బాలెనో దక్కించుకుంది. ఈ కారు కూడా మారుతి సుజుకీకే చెందినది కావడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలతో భారత్‌లో కార్ల అమ్మకాలు రికార్డు స్థాయికి చేరాయి. కేంద్ర ప్రభుత్వం చిన్న కార్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. ప్రీమియం కార్లపైనా జీఎస్టీతోపాటు సెస్‌ను తగ్గించింది. దీంతో కార్ల ధరలు గణనీయంగా తగ్గి సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. ధర తగ్గడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కార్ల అమ్మకాలు 2024 సంవత్సరం కన్నా 2025లో 6 శాతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులోనూ మారుతి సుజుకీ ముందుంది.